# మన'వే'మన పద్యాలు

**ఆ. వె. ముచ్చు గుడికి బోయి ముడివిప్పునేకాని**
**పొసగ స్వామి జూచి మ్రొక్కడతడు**
**కుక్క యిల్లు సొచ్చి కుండలు వెదుకదా!**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : ముచ్చు = దొంగ.
ముడివిప్పునేకాని = డబ్బుల డిబ్బీ తెరచుటకు ప్రయత్నించునేకాని.
సొచ్చి = ప్రవేశించి.

**తాత్పర్యము** : దొంగ గుడికి పోతేహుండీలోని డబ్బులను తస్కరించడానికే ప్రయత్నించును. కాని, దేవునికి నమస్కారము చేయవలననే తలంపు కలుగదు. అతని దృష్టి డబ్బులపైనేగాని దేవునిపై నుండదు. శునకము (కుక్క) ఇంట ప్రవేశించినచో, అది అంట్లకుండలు ఎచటనున్నవో వెదకును కాని దేవుని మందిరమును వెదకునా? అటులనే మన మనసు కూడా దేవునియందు లగ్నమగుటకు ఎంతో శ్రమపడాలి. అది ఎల్లప్పుడూ ప్రాపంచిక విషయములపైన దృష్టి నిలుపుతూ ఉంటుంది.

**ఆ. వె. వాన రాకడయును బ్రాణంబుపోకడ**
**కానబడ వెంత ఘనునకైన**
**గానబడిన మీద గలియెట్లు నడచురా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**తాత్పర్యము**: వానయెప్పుడు వచ్చునో, ప్రాణమెప్పుడు పోవునో యెంత గొప్పవానికైనను దెలియదు. అట్లు తెలిసినచో ఇది కలియుగ మెందుకవుతుంది? ఈ కలియుగములో ప్రజలు తపశ్శక్తులు, యోగశక్తులు లేక భూతభవిష్యద్వర్తమానములు తెలిసికొను జ్ఞానము లేక యుందురు. అందువలన వారు ఈ భూమి ఉన్నంతకాలము తాము ఉండిపోయెదరని తలపోస్తూ, యెన్ని దుష్టకృత్యములైనను చేసి, ధనార్జనే ప్రధానముగా జీవితమును వ్యర్థపరచుకొందురు. వారి మరణమును వారు ముందుగనే తెలిసికొన్నయెడల పరీక్షిత్తువలె పరమార్థచింతన చేయరా? అని దీని భావము. కావున 'దీపముండగనే ఇల్లు చక్కబెట్టుకొనవలెన'నే మన పెద్దల మాటను అనుసరించి, ఈ మానవజన్మనెత్తినందుకు జన్మసాఫల్యమును పొందగలిగే పనులు చేయవలెనని భావము.

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*

***అతి దుర్లభమైన నరజన్మ లభించడం మన అదృష్టం. దానిని సద్వినియోగం చేసుకొని, జీవన్ముక్తిని పొందడానికి కృషి చేద్దాం!***